
# ముక్కుపుల్ల

ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు



'సుబ్బమ్మ చచ్చిపోయిందిరా' అని చెప్పింది మా అమ్మ ఖాళీ నీళ్ళు చెంబు గూట్లో పెడుతూ.

'అదేంది మా'... అన్నాను నేను. మరొక మాట నా గొంతులోంచి రాలేదు.

ఆమె నిస్తేజంగా నా వైపు చూసింది. ఆమె కనుగుడ్ల మీద నీటి చెమ్మ తొణికిస లాడింది. వొక దీర్ఘనిట్టూర్పు మాత్రమే ఆమె నుంచి సమాధానంగా వచ్చింది.

ఆ మౌనాన్ని భంగపరుస్తూ, 'నేను పోయినసారి వొచ్చినపుడు గూడా బానే వుణ్ణింది గదమా' అన్నాను. నా మాటలు నాకే పేలవంగా వినిపించాయి.

అమ్మ కనుకొలకల మీదినుంచి రెండుకన్నీటిబొట్లు కిందికి జారాయి. పైటకొంగుతో కళ్ళు అద్దుకుంటూ ఆమె అనింది.

'యేం బాగుండడంలే, కడుపు కింత కూడా, కంటికింత నిద్రా, బతికినంతకాలం రోగం రొచ్చుతోనే గదా బతికింది. సచ్చి సుకపడింది పుణ్యాత్ముడాలు'.

కాళ్లేతులైనా కడుక్కోకుండానే నేను లేసి చెప్పులేసుకున్నాను. మాసందు మలుపు తిరిగాక మూడో ఇల్లు సబ్బమ్మది.

సుబ్బమ్మతో మాకు బంధు సంబంధం యేమీ లేదు .కానీ నాకు మాత్రం ఆమె అంతకన్నా ఎక్కువే.

నెలలు తక్కువ కాన్పులో మా అమ్మ నన్ను కనిందంట. బక్క బక్కగా చస్తానో బతకతానో అన్నట్టున్న నాకు సుబ్బమ్మ పాలు ప్రాణం పోశాయంట.

నా గుండెల్లోంచి దుఃఖం కళ్ళలోకి తన్నుకొచ్చింది.

చుట్టు గుడిసెకీ పెద్దింటికీ మధ్య శవాన్ని పండబెట్టారు.

నాగవ్వ కూతురు శవం మీద పడి యేడుస్తూ వుంది.

'వో కూతరో...నా కూతరా.. నన్నొదిలి పొయ్యావె నా కూతరా..నీకంత కష్టమేమొచ్చిందె నాకూతరా..యింక నాకెవురుండారె నాకూతరా ...నాకింత కూడుబెట్టే దిక్కేది నాకూతరా.. నాయమ్మా ..నాకూతరా.. నాబంగారా, నా రతనాల కూతరా నా సుబ్బమ్మా...'

'అత్తా...లెయ్యత్తా..సమాళించుకో..మేమంతా లేమంటత్తా...నీకేం లోటు జెయింత్తా.. నీకన్న కొడుకుండాదత్తా నిన్ను పువ్వల్లో పెట్టి జూసుకుంటాడత్తా..' అంటూ



చెంగమ్మ నాగవ్వ రెండు చంకల్లోకీ చేతులు దూర్చి పొదివి పట్టుకుని లేపి గోడకి ఆనించింది.

ఆమె నీరసంతో కనురెప్పలు తెరిచి నన్ను చూసింది. వొక్క ఉదుటున లేసి ముందుకు జరిగింది.

'ఏమయ్యా వొచ్చినావా ఏమయ్యా ...సబ్బమ్మ అందర్నీ అన్యాయం జేసిపోయింది ఏమయ్యా అంటూ శవం వైపు తిరిగింది.

'మే సుబ్బమ్మా ..లెయిమే లెయి.. తిరప్తి నుండి ఏమయ్యొచ్చాడు సుబ్బమ్మా,'ఏడుకుడుకు యిడ్లీలు తిను సుబ్బమ్మా 'అని నీకు దుడ్లు యిచ్చే దానికి ఏమయ్యొచ్చాడు... లెయి సుబ్బమ్మా. నా కూతరా... నా వరాల కూతరా లెయి' అంటూ శవాన్ని పట్టుకుని వూపేసింది.

దుఃఖం కట్టలు తెంచుకుని కన్నీళ్ళయి కిందకి జారింది. నేను అక్కడి నుంచీ కదిలి బయట మట్టి తిన్నె మీద కూర్చున్నాను.

కళ్ళ ముందు చీకటి తెరలు జారుతున్నాయి. వెన్నీపుకు మట్టిగోడ ఆసరాగా ఆనింది.

'అబయా ..యిగ్గో వొక గుక్క నీళ్ళు తాగు' అంటూ యెవరో యిత్తడి చెంబు చేతికి ఇచ్చారు.

చెంబు పైకెత్తి కొద్దిగా నీళ్ళు తాగాను.చెంబు చేతికి తీసుకుంటూ కుప్పయ్య అన్నాడు,'యింటికి బొయి రొవంతసేపు పొనుకోబో అబయా '

'లేదులేనా 'అని కొంచం నిటారుగా కూర్చున్నాను.

'యెట్ల జరిగిందినా ' అని అడిగాను.

'వారం దినాలుగా వొకటే మాపన జెరం, నిన్న పొద్దన్నుంచీ వాంతులూ బేదులూ, మనిషి యాలాడబడి పొయింది.సందేళ బండి కట్టుకుని గవుర్మెట్టాసుపత్రికి తీసకబొయినాం. బులుకోజు యెక్కిచ్చినారు.వొకేళకాడ పొయింది' అని కుప్పయ్య చెప్పాడు.

నువ్వెన్ని జెప్పు కుప్పన్నా మనిషికి మరీ అంత ఇది పనికి రాదునా. పేణం మీద కొచ్చినపుడన్నా ఏడకేసు కోను యింట్లో గింజల్లేవని యిక్కన పక్కనోళ్ళతో నన్నా అంటే యేమి? పరాయోళ్ళు సరే,పక్కనే తోడబుట్టినోడు వుండాడు గదా 'రేరంగా' అంటే తనకు కలిగిందే యింత బెట్టకపొయినాడా.రంగడి బిడ్డల్నంతా సాకి సంతరించింది గదా ఆమాతరం సొతంతరం లేదా, యిప్పుడు జూడు పేగు యెండబెట్టుకొని పేణానికి దెచ్చుకునింది' అని పల్లి రామయ్య బాధగా అన్నాడు.


'వొకరికింత బెట్టునే గానీ వొకర్నింత చెయిజాచి అడగంగ యేదినమన్నా కన్నామా రామయ్యా, యీదినం ఆమాట అనేదానికి' అని కుప్పయ్య బదులు చెప్పాడు.

అప్పుడే వచ్చిన టీయంగడి మస్తాన్ వేపచెట్టు మొదలుకు ఆనుకుని నిలబడ్డాడు.

'అనా వొల్లు బాగలేనపుడు పొద్దన్నే లేసి మొహం కాళ్లేతులు కడుక్కోని ఏడుకుడుకు యిడ్లీలు తిని ఏడుకుడుకు కాపీ తాగితే అంతకన్నా మందు యేముంటాదినా. సుబ్బక్కకి వొల్లుబాగలేదని నాకు తెలుసుంటే దినామూ పొద్దన్నే ఏడుకుడుకు యిడ్లీలు ఆకులో పెట్టుకోని తెచ్చి పెట్టుండనా. యెంత దా సకాయం జేసింది సబ్బక్క నాకు' అని మస్తాన్ చెప్పాడు.

సబ్బమ్మ మంచితనాన్ని గురించి అక్కడున్న అందరూ తలోమాట చెప్పడం మొదలుపెట్టారు.

'అదట్టుణ్ణే, మా పెద్దమ్మి సమర్తయి మూల కూచ్చేసుంటే యింట్లోకి తొడుక్కోని వొచ్చినామా, పిలిచినామని గాదు పిలవలేదని గాదు. యడాడ వూళ్ళలో వుండే చుట్టపక్కాలంతా వొచ్చిదిగేసినారా. యింత గుంపును జూసి మాప్రాణాలు పైన్నే పాయనే. యేదో తలమింద యిన్ని ఏడుకుడుకు నీళ్ళుబోసి గుట్టుగా యింట్లోకి తొడుక్కొనొచ్చేసుంటే సుకం గదా. యింత కార్రెం యెందుకు పెట్టుకున్నాంరా సామీ అని మా యింటిది కళ్ళ నిండా నీళ్ళు బెట్టుకుని కూలబడి పోతే ఆదినం సుబ్బమ్మ గదా దైర్నం జెప్పింది.'తొలిబిడ్డ సమర్తయితే



'తొలిబిడ్డ సమర్తయితే కళ్ళనీళ్ళు బెట్టుకుంటావా చిట్టెమ్మా' అని అసలు సందేళని గూడా చూడకుండా ఆ పళాన ముక్కుపుల్ల తీసి నాచేతల్లో బెట్టి 'యశోదమ్మ కోడలి దెగ్గిరికి బొయ్యి దీన్ని బెట్టి రెండు నూర్లు తేబో' అని అంపించింది గదా.

**కళ్ళనీళ్ళు బెట్టుకుంటావా చిట్టెమ్మా' అని అసలు సందేళని గూడా చూడకుండా ఆ పళాన ముక్కుపుల్ల తీసి నాచేతల్లో బెట్టి 'యశోదమ్మ కోడలి దెగ్గిరికి బొయ్యి దీన్ని బెట్టి రెండు నూర్లు తేబో' అని అంపించింది గదా. అంతమాత్రాన అయిందా , ఆదినం సుబ్బమ్మ ఒక్క పనా జేసింది. వొండి వార్చిందా... వొడ్డించిందా..పుల్లిస్తరాకులెత్తిందా. వొక కులమా, వొక నెత్తురు పంచుకుని పుట్టిన మనిషా... ఆపదంటే యెంతకన్నా అక్కరకొచ్చేది గదా. అయినోళ్ళు అంతగుంపు వొచ్చి దిగినారే గానీ వొక్కరన్నా యెంగిలి లోటా అట్టెత్తి యిట్ల బెట్టినారా' అని వెంకటముని కళ్ళ నిండా నీళ్ళతో చెప్పాడు.**

'యింత మంచి మనిషిని తీసకబొయ్యేదానికి ఆ దేముడికి చేతులెట్టా వొచ్చాయో' గదా అని అతను బొటబొటా కన్నీళ్ళు కార్చాడు.

ఆమాటతో అందరి కళ్ళూ చెమ్మగిల్లాయి.

యింతలో పద్మమ్మ హడావిడిగా వచ్చింది.

'వుమయ్యా ఇదేనా రావడం' అని పలకరించి వాకిట్లో నుంచే శవం వైపు తొంగి చూసి యివతలకి వచ్చింది.

'రేరంగా' అంటూ వేపచెట్టుకింద కూర్చుని వున్న రంగయ్య దగ్గరకు నడిచింది.

'యిట్ట దిగులుబడి కూకుంటే యెట్ట. సమాలించుకోవాల. మీయన్నగూడా వొచ్చేసినాడుగదా. జరగాల్సిన పని జూడండి' అంటూ అతని పక్కన కూర్చునింది.

ఆ మాటతో రంగయ్య పద్మమ్మ చేతులు పట్టుకుని బొరోమని ఏడ్చేశాడు. 'పద్దక్కా యింకనా బిడ్డలు యెట్ట బతికి బట్టగట్ట బోతారు. యెనిమిది మంది బిడ్డల్ని యెట్టగన్నామో కానీ యేదినమన్నా నేను గానీ నాపెళ్ళాం గానీ పట్టించుకున్నామా. యేరిగితే కడిగి యేడిస్తే కడుపుకింత బెట్టి వాళ్ళని సాకి సంతరించింది మాయక్క గదా. ఇప్పుడు తొమ్మిదో సూలు కడుపుతో వుండాది నా పెళ్ళాం. కాన్పు చేసేదానికి నా తోడబుట్టింది లేదు గదా.'పాలెమ్మా ఈసూలు నీకు ఆడబిడ్డ పుడతాది జూడు' అని చెప్పిన మాయక్క ఆడబిడ్డకి పురుడు బొయ్యకనే మమ్మల్నొదిలి పాయనే' అని రంగయ్య కడుపుచించుకున్నాడు.

సుబ్బయ్య తమ్ముణ్ని పొదివి పట్టుకుని

'రేరంగా గమ్మునుండ్రా' అంటూ తనూ యేడ్చేశాడు.

యీ యేడుపులకి లోపలి నుంచి చెంగమ్మ ముక్కు చీదుకుంటూ వచ్చింది. ఆమె బుగ్గన యెప్పుడూ ముక్కుపొడి వుంటుంది.ముక్కుపొడి వల్ల ఆమె పళ్ళ చిగుళ్ళు నల్లబారి పోయి ఉంటాయి. కుడిచేతి మూపుడు వేలునీ నడిమి వేలునీ యెడం చేసి నోటికి అడ్డుగా పెట్టుకుని, ఆవేళ్ళ సందుల్లోంచి 'థుపూ' మని యెంగిలి వూసింది.

'రంగయ్యా మేమంతా లేమా లెయి' అంటూ మరిదిని వూరడించింది.

'మా రత్నాన్ని నేను కన్నానే గానీ సుబ్బమ్మ బిడ్డగానే గదా పెరిగింది. రొవంత సేపన్నా రత్నాన్ని వొదిలి వుండేది కాదు గదా. యెండన బడి కూలి పన్లకు పొయొచ్చి సందేళ రత్నాన్ని యెత్తుకుని పేటకి సిన్మాలకి బొయ్యేది గదా. గాజులనీ, రిబ్బన్లనీ అడిగిందంతా కొనిచ్చేది గదా' అని చెంగమ్మ చెప్పుకొచ్చింది.

'బతకలేక పట్నం బొయినాం కానీ యీడ్నే వుణ్నుంటే మా యాడబిడ్డ యీగెతికి వొచ్చేదా' అనింది.

'మనం యెన్నసుకున్నా పొయిన పేణం తిరిగి రాదు గదా. సుబ్బమ్మకి యీభూమ్మీద ఆయుస్సు అంతే అనుకోవాల. సరే లెయ్యండి. లేసి జరగాల్సిన పన్లు జూడండి' అని పద్మమ్మ తొందర పెట్టింది.

'రేరంగా ...మీయన్న దూరాభారం వొచ్చాడు. దుడ్లు వుండాయో లేవో. అప్పో సొప్పో జేసి నువ్వేగానీ. అంతా అయినాక మల్ల కూకోని మాట్లాడుకుందాం' అని చెప్పి యెత్తుబడికి కావలసిని సామాన్ల లిస్టు చెబుతూ అందరికీ పనులు పురమాయించింది.

నేను లేసి ఇంటివైపు నడిచాను.

★★★

సుబ్బమ్మ కొడుకు శేఖర్ నేనూ వొకే యీడు వాళ్ళం. నాలుగో తరగతిలో వాడు చదువు మనేశాడు. టైలరు పనికి పొయ్యేవాడు. కొంతకాలం కాటన్ మిల్లులో పనిచేశాడు. సినిమాల కోసం వాడు దొంగ రైళ్ళలో నాయుడుపేటకీ ,నెల్లూరుకీ వెళ్ళేవాడు. విజయవాడకీ, మద్రాసుకీ కూడా రైళ్ళలో తిరిగేవాడు.

'బొంబాయిలో ప్యాంటు కుడితే నలపై రూపాయ లంట. నేను బొంబాయి పోతా' అని చెప్పి వొకసారి వాడు రైలెక్కాడు. మరి తిరిగి రాలేదు. యెక్కడో రైలు కిందపడి చచ్చిపొయ్యాడని చెప్పేవాళ్ళు.

'నా మనవడు బొంబాయిలో టైలరు పని నేర్చు కుంటా వుండాడు' అని నాగవ్వ అడిగినోళ్ళతో చెప్పేది.

సుబ్బమ్మ మాత్రం శేఖర్ గురించి యెప్పుడూ యేమీ మాట్లాడేది కాదు.

సుబ్బమ్మకి భర్తలేడు. యేమయ్యాడో తెలీదు. సుబ్బమ్మ మొగుడు దేశాంతరం పొయ్యాడని పెద్దవాళ్ళు చెప్పేవాళ్ళు. సుబ్బమ్మ పుట్టింట్లోనే వుండేది. తండ్రి అయిసు అమ్మేవాడు. వడదెబ్బ తిగిలి రెండేళ్ళ కిందట చచ్చిపోయాడు. నాగవ్వ పేడ యేరుకొచ్చి పిడకలు తట్టి అమ్ముతుంది. సుబ్బమ్మ కూలి పనులకు పోతుంది. సుబ్బమ్మకి వొక అన్న వొక తమ్ముడు. తమ్ముడు రంగయ్య కుడికాలి పాదం సన్నగా మెలి తిరిగి వుంటుంది, అందరూ కుంటి రంగయ్య అంటారు. రంగయ్య టైలరు. సత్యవేడులో వొక సాయిబుల యింటి తిన్నెమీద మిషన్ కుట్టేవాడు. ఆ యింటి సాయిబు పెళ్ళాన్ని వొకటే కొట్టేవాడు. సాయిబుతో పడలేక బూబమ్మ కుంటి రంగయ్యతో వచ్చేసింది. తన యిద్దరు బిడ్డలతో సహా బూబమ్మ పేరు ఫాతిమా ఆమెకి ఆపరేషన్ అంటే భయం. రంగయ్యకి ఫాతిమా

అంటే ప్రాణం. మా వూరికి వచ్చేశాక ఆరుగురు మగబిడ్డల్ని కనింది ఫాతిమా. యిప్పుడు మళ్ళీ గర్భంతో వుంది. యెనిమిది మంది బిడ్డల ఆకలి తీర్చే సంపాదన కాదు రంగయ్యది. సుబ్బమ్మే వాళ్ళకి సగం ఆదరువు.

సుబ్బమ్మ అన్న పేరు సుబ్బయ్య. వూరమ్మిడ కాటన్ మిల్లులో పని చేసేవాడు. వొకసారి సమ్మె జరిగింది. సుబ్బయ్యతోపాటు చాలా మందిని పనిలోంచి తీసేశారు. సుబ్బయ్య కొంతకాలం మగ్గం నేశాడు. సంపాదన చాలేది కాదు. మద్రాసు అవతల యెక్కడో కాటన్ మిల్లులో చేరాడు. అక్కడే కాపురం.

★ ★ ★

'యెప్పడనంగ బైదేలినావో రెండు చెంబులు నీళ్ళు పోసుకొని రాబో' అని మా అమ్మ టవల్ నా చేతికి యిచ్చింది.

దొడ్లో బావి దగ్గరకు నడిచాను.

స్నానం చేసి వచ్చేప్పటికి సుబ్బయ్యనీ. చెంగమ్మనీ అన్నానికి పిలుచుకు వచ్చింది.

అన్నాల ముందు కూర్చున్నామేగానీ ముద్ద దిగడం లేదు.

'రే సుబ్బా మీ యమ్మ సంగతేంది' అని మా అమ్మ కదలేసింది.

'మీ యమ్మకి వొళ్ళు వొక దినం వున్నట్టు వొక దినం వుండదు. యింతకాలం సుబ్బమ్మ గదా బిడ్డని జూసుకున్నట్టు చూసుకునింది. యింటికి పెద్దోడివి, కష్టమో నష్టమో ఆ బారం నువ్వే మొయ్యాల' అని చెప్పింది.

'అకా... అదేంది అట్టంటావు. మాయమ్మ నాకు బారం యేముండాది. మేం తినే నాలుగు మెతుకుల్లోనే రెండు మెతుకులు మా యమ్మ తింటాది. కార్రెం అయిపొయ్యాక నా కూడా తొడక్కోని పోనా' అని చెబుతూ సుబ్బయ్య పెళ్ళాం వైపు చూశాడు.

'అకా... మా యాడబిడ్డని మాత్రం యెన్నితూర్లు అడగలేదు నేను. మే... సుబ్బమ్మా పట్నం వొచ్చెయ్యి. యాడ జేసుకునే కూలో నాలో ఆడ జేసుకుందువు. కూటికి దిగుల్లేకుండా బతకచ్చు' అని నెత్తీనోరు బాదుకున్నా యినక పాయనే' అని చెంగమ్మ యాష్టపొయింది.

'కార్రెం గురించి యెత్తినావు గదా, దాన్ని గురించి గూడా వొకమాట అనుకుంటే మంచిది' అంటూ అమ్మ చెంగమ్మ కళ్ళలోకి చూసింది.

యింతలో 'అకా.. మాయన్న వుండాడా' అంటూ రంగయ్య లోపలికొచ్చాడు.

'చావుసామాన్లు కొనుక్కోని పిచ్చయ్య వొచ్చేసినాడు. జంగమోడి కోసరం లొక్కోదికి బొయ్యుండాడు' అని చెబుతూ వంటగది మెట్టుమీద కూర్చున్నాడు.

'రంగడు గూడా సమేనికి వొచ్చినాడు. కార్రెం అంటే యీ దినాల్లో మాటలు గాదు. యెంత తక్కవ జేసుకున్నా నాలుగైదు నూర్లన్నా అవతాది. రంగడి పరిస్తితి తెలవంది గాదు. అంతమంది బిడ్డల్తో వాడెట్ట యాగతుండాడో ఆ బగమంతుడికే తెలవాల' అని అమ్మ సమాధానం కోసం సుబ్బయ్య వైపు చూసింది.

'అట్నే గానీక్కా. రంగడి పరస్తితి నాకు తెలవంది యేముండాది. మంచికీ సెబ్బరకీ యింటికి పెద్దోణ్ణే నేనే గదా పాలు అయ్యాక వూరికి బొయ్యి దుడ్లు సమాలించుకోని వొస్తా' అని చెబుతూ సుబ్బయ్య భార్య ముఖంలోకి చూశాడు.

చెంగమ్మ నిర్వికారంగా కూర్చుని వుంది.

'మాయక్క తొలి నుండీ మా యింట్లో మనిషిగదా. ఆ కార్రెం కర్చుగూడా నేనే పెట్టుకుంటాన్లేకా' అని రంగయ్య తెంపుగా అన్నాడు.

'జంగమాయన లేడంట. పిచ్చన్న సెంకూగెంట తెచ్చుండాడు' అని అరుస్తూ రంగయ్య కొడుకు లోపలి కొచ్చాడు.

అందరం లేసి పీనిగింటికి నడిచాం.

'సుబ్బక్క సావుకి సెంకూదితేనే జంగమోణ్ణే అయిపోనుగానీ పదంద్రా' అని చెప్పి పిచ్చయ్య బొయ్యిమని శంకు వూదాడు.

యేడుపులు తీవ్రమయ్యాయి.

'గోయిందా... గోయిందా... గోయింద' అంటూ పాడె కదిలింది.

యేటి వడ్డున పేర్చిన కట్టెల మీదకి శవం చేరింది. శవం మీద కూడా కట్టెలు పెట్టారు. కిరోసిన్ చల్లారు.

'సుబ్బన్నా యిది మా యింట్లో చానా యేళ్ళుగా వుండాద్ది, వయిద్దిగానికని మాయమ్మ తెచ్చిపెట్టింది. పనిగ మీద బెట్టు' అని వెంకటముని కాగితం పొట్లం విప్పి చిన్న గంధం చెక్క యిచ్చాడు.

శవం తల దగ్గర గంధం చెక్క పెట్టారు. సుబ్బయ్య కొరివి పెట్టాడు. మంటలు భగ్గున లేశాయి.

'పుణ్ణెం జేసుకున్నోళ్ళుగ్గనీ యీ మిట్టమింద తావు దొరకదు తెలుసా' అని బుజ్జయ్య గొప్పగా చెప్పాడు.

'యేటికి యెంత యెల్లవరానీ నీళ్ళు యీ మిట్టెక్కవు' అని రామయ్య అన్నాడు.

యీ మాటలు చాలా శ్రద్ధగా ఆలకిస్తున్న టీ అంగడి మస్తాన్ ముందుకొచ్చి,

'అనా మీకు పుణ్ణెం వుంటాది. నేను పోతే నన్ను గూడా యీ మిట్లమిందే పెట్టాల' అని ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

'యెవురికి యాడ రాసుండాదో గదా' అంటూ యెట్టాయన మరికొన్ని కట్టెలు మంటల్లో వేశాడు.

యింకొంత సేపు అక్కడే నిలబడ్డాం. యేట్లో మునిగి తడిగుడ్డలతో వెనుతిరిగాం.

★ ★ ★

ఆ సాయంత్రం చెట్టుమీద వొక్క ఆకు కూడా కదలడం లేదు. వాకిట్లో నులకమంచాల మీద కూర్చుని వున్నాం.

గొల్లున యేడుపులు వినిపించాయి.

నేనూ మా అమ్మ దిగ్గున లేసి పరుగెత్తాం.

యిల్లంతా యేడుపులతో నిండిపోయి వుంది.

అందరి ముఖాల్లోనూ ఆందోళన.

సుబ్బమ్మ ముక్కుపుల్ల మాయమయింది.


నేలమీద పడి పొర్లుతూ నాగవ్వ యేడుస్తోంది.

'నీయమ్మ బతికేది యింకెట్ల నా కూతరా... నీ యమ్మని అన్నాయం జేసి పోయినావె నా కూతరా... నీ యమ్మని యింకెవురు మతిస్తారె నా కూతరా... అర తులం ముక్కుపుల్ల నా కూతరా... యెవురియెదాన బెట్టావె నా కూతరా...'

ముక్కుచీది మొత్తకి తుడిచి నాగవ్వ యేడుపు కొనసాగించింది.

'నాగక్కా బాగా గెవనం దెచ్చుకో వొల్లు బాగలేనపుడు సుబ్బమ్మ ముక్కుపుల్ల దీసిచ్చిందేమో. కుండలోనో, సట్టిలోనో బెట్టుంటావు యెతికి చూడుబో' అని


కోడలు పిల్లా - కొత్త సలహా





మురికి మటుమాయం చేతులు మండవు ఎక్కువ ఖర్చు లేదు
బావి నీటితోకూడా ఉపయోగించవచ్చును.




త్రిపుల్ ఎక్స్ XXX
సూపర్ పవర్ డిటర్జంట్ కేక్

డిస్ట్రిబ్యూటర్స్
భారతీ సోప్ వర్క్స్
ఇందిరాగాంధీ నగర్, IV లైను, (నల్లచెరువు) గుంటూరు-3.
ఫోన్ : 225833, 223154

సలహా పంపిన ఈ వారం కోడలు పిల్ల :
ఎన్.సుజాత, మూకలవారిపాలెం, కృష్ణా జిల్లా.
ఇలాంటి సలహాలు ఏ కోడలుపిల్లయినా మా కంపెనీ ఎడ్రసుకు కార్డుమీద పూర్తి ఎడ్రసుతో పంపవలెను. నచ్చినవి ప్రచురిస్తాం.



'యిక్కన పక్కనోళ్ళకి అపదొస్తే తప్ప యేనాడైనా సుబ్బమ్మ ముక్కుపుల్ల తీసిందా. యీ సవితి సచ్చిగూడా నాకు సుకం లేకుండా జేసిందే' అనింది నాగవ్వ. ఆమె గొంతులో అసహాయత, కోపం, వుక్రోషం ధ్వనించాయి.

పద్మమ్మ అనింది.

'నీకు తెలవంది యేముండాది పద్నమ్మా ... యిక్కన పక్కనోళ్ళకి ఆపదొస్తే తప్ప యేనాడైనా సుబ్బమ్మ ముక్కుపుల్ల తీసిందా. యీ సవితి సచ్చిగూడా నాకు సుకం లేకుండా జేసిందే' అనింది నాగవ్వ. ఆమె గొంతులో అసహాయత, కోపం, వుక్రోషం ధ్వనించాయి.

'బులుకోజు బుడ్డీ యెక్కిం చేటపుడు గూడా నా కూతురు మొహాన ముక్కుపుల్ల వుండాది పద్నమ్మా' అని గబుక్కున యేడుపు ఆపి అనింది.

'బండిమీద నుండి శవాన్ని దించి పండబెట్టినప్పుడు గూడా ముక్కుపుల్ల వుణ్ణేంది. నాకు గెవనం వుండాది' అని చెబుతూ ఫాతిమా చెంగమ్మ వైపు చూసి.

'తలదెగ్గిర గదా మా యక్క కూకోనుణ్ణేంది. అకా, నువ్వు గెవనించలేదంటకా' అని అడి గింది.

చెంగమ్మ చివ్వున తలెత్తి

'ఆడబిడ్డ సచ్చియేడ స్తావుంటే ముక్కుల్లో యేముం డాది, చెవల్లో యేముండాది అని చూసేదానికి నేను కసాయోళ్ళ యింట బుట్ట లేదు' అని సమాధానం యిచ్చింది.. యీ మాటతో ఫాతిమా ముఖం ముడుచు కునింది.

'మూడు దినాలనాడు కలిచారు కోసరం సుబ్బమ్మ మా యింటికొచ్చింది. ఆ దినం ముక్కుబోసిగా వున్నట్టు గెవనం' అని లక్ష్మమ్మ సందేహం వ్యక్తం చేసింది.

'యాడన్నా కుదవ బెట్టుండాదేమో వొకతూరి అడిగిజూస్తే పోలా' అని యెవరో సలహా యిచ్చారు.

'వొరే సుబ్బా నాలుగడుగులు అట్టబొయ్యి యశోదమ్మ కోడలినీ, సిద్దమ్మనీ అడిగిరాబో' అని పద్మమ్మ ఆదేశించింది.

'పినిగిని పాడెమింద బెట్టేటపుడు ముక్కుమీద తళుక్కున మెరిసినట్టుండాదికా' అని పద్మమ్మతో కుప్పయ్య అన్నాడు.

'మశాణం కాడికి బొయ్యి వొకమాట యెట్టోణ్ణే అడిగిరాబో' అని కుప్పయ్యకే పని పురమాయించింది.

తెరలు తెరలుగా నాగవ్వ యేడుపు కొనసాగుతూనే వుంది.

యింతలో సుబ్బయ్య, పల్లి రామయ్య వచ్చారు.

'యెవురి దెగ్గిరా పెట్టలేదంట. సమచ్చరం ముందు వొకతూరి యశోదమ్మ కోడలిదెగ్గిర నూర్రూపాయలికి బెట్టేందంట. నెల తిరక్కుండానే యిడిపించుకోని పొయ్యిందని చెబ్తా వుండారు' అని వాళ్ళు చెప్పారు.

'దిట్టంగ యెట్టుండేది సుబ్బమ్మ ముక్కుపుల్ల' అని లక్ష్మమ్మ అనింది.

సుబ్బయ్య వగర్చుకుంటూ వచ్చాడు.

'పీనిగ కాలి బూడిద గూడా అయిపొయ్యింది. దీపం ముట్టిచ్చుకోని బూడిదంతా గెలికినాం. యేం కనబళ్ళా' అని చెప్పాడు.

చిట్టెమ్మ పద్మమ్మకి దగ్గరగా జరిగి గుసగుసగా అనింది, 'పద్నక్కా యీ తాగుబోతు నా బట్టనెందుకు అంపిచ్చినావు మశాణం కాడికి.'

పద్మమ్మ సమాధానం యేమీ చెప్పకుండా కుప్పయ్య కళ్ళలో దేని కోసమో వెతికింది.

చెంగమ్మ మొత్తలో కూలబడి యేడవడం మొదలుబెట్టింది.

'యే నా సవితి కళ్ళో దానిమీద పడ్డాయిరా దేవుడో యే నా సవితో దాన్ని అమికేసిందిరా దేవుడో. మేం వూళ్ళో లేంది జూసి ముక్కుపుల్ల మాయం జేసేసినార్రా నాయనో!' అంటూ గుంపువైపు తిరిగి చెప్పింది. 'మా సుబ్బమ్మ యెన్ని తూర్లు మా రత్నాతో చెప్పలేదు. 'నీ పెళ్ళికినా ముక్కుపుల్ల యిస్తానే ముండా' అని. బిడ్డకి పెళ్ళీడొచ్చింది. ముక్కుకి యింత బంగారన్నా బెట్టి అత్తింటికి అంపిస్తామని ఆశపడ్డాం. మాకు అన్నాయం జేసేసినారు. వాళ్ళ చేతులు పడిపోను.. వాళ్ళ కళ్ళలో నిప్పులు పడ.. వాంతులు బేదులొచ్చి వాళ్ళని మశాణంలో బెట్ట. వాళ్ళకి పాడెగట్ట..' అని ఆమె శాపనార్థాలకి దిగింది.

ఫాతిమా ముఖం యెర్రబడింది.

'ఆ నోటికి యెంతమాటొస్తే అంత మాటేనా.. యెవుర్ని అంటావుండావు. యీడెవురూ దొంగలూ తోడుబోతులూ లేరు. బతికినన్నాళ్ళూ లేని అభిమానం పీణం బొయ్యాక వొచ్చిందా ఆడబిడ్డ మింద. పీనిగ మిందబడి దొర్లి దొర్లి దొంగేడ్పులు యేడ్చిన నా సవితులకే తెలవాల ముక్కుపుల్ల యాడకి బొయిందో' అని ఫాతిమా నోరు చేసుకుంది.

రంగయ్య కళ్ళు వురమకపోతే ఆమె ఆగేది కాదేమో!

'మూస్కోని పడుండట్ట' అని అరిచి రంగయ్య కుంటికాలు యెగరేసుకుంటూ బయటకు నడిచాడు. వాకిట్లో తిన్నెమీద కూలబడి భోరున యేడ్చేశాడు.

పద్మమ్మ వెళ్ళి అతని భుజం మీద చేతులు వేసింది.

'అకా, యింటికి చిన్నోణ్ణయినా యింత కార్రెం నెత్తినెత్తుకున్నానే, నా వల్ల అవునా. పొద్దన్నే మున్సీబు దెగ్గిరికి బొయ్యి 'అనా యెత్తుబడి అయ్యాక మా యక్క ముక్కుపుల్ల దెచ్చిపెడతా రెండునూర్లు యీనా' అని అప్పుదెచ్చి పెట్టినానే. యిప్పుడు నేను యాడ పెరక్కొచ్చి కట్టేది. యే బూములు బావు లుండాయి నాకు. రేత్రీ పొగులూ కంటికి నిద్రలేకుండా గుడ్డలు కుట్టి సంపాదించి దెచ్చేది నా బిడ్డల కూటి గ్గూడా చాలడం లేదే. మున్సీబు అప్పు యాణ్ణించి తెచ్చి తీర్చేది! అకా, నేనింక యేబావో చెరువో జూసుకోవాల్సిందేనకా' అని యేడుస్తూ చెప్పాడు.

పద్మమ్మ రంగయ్య ముఖం దగ్గరకు వంగి వూరడింపుగా మాట్లాడింది.

'రే.. రంగా నువ్వుండు. ముసిల్ది డ్రామాలాడ్తా వుండాది. నిదానంగా అడగతాం. ముక్కుపుల్ల బయటపెడ్తాది'

పద్మమ్మ లేచి పంచలోకి నడిచింది. చెంగమ్మని చెయ్యి పట్టుకుని వొక మూలకి తీసుకువెళ్ళింది. గుసగుసగా వాళ్ళిద్దరూ మాట్లాడు కుంటున్నారు.

చుట్టు గుడిసె చూరుకింద నిలబడిన ఫాతిమా

వాళ్ళని నిప్పులు కక్కుతూ చూసింది.

'పాతెమ్మా, వొక తూరి యిట్రా' అని పద్మమ్మ పిలిచింది.

'తురకదాని అక్కరొచ్చిందా యిప్పుడు యీనా సవితిలకి' అని గొణుగుతూ ఆమె వాళ్ళ దగ్గరకు నడిచింది.

ఫాతిమాకి పద్మమ్మ యేదో చెప్పింది.

చెంగవ్మ తనకేమీ సంబంధం లేదన్నట్టుగా బొడ్లోనుంచి ముక్కుపొడి పొట్లం తీసి విప్పింది. చిటికెడు పొడి తీసుకుని బుగ్గల్లోకి దూర్చి చేతులు విదలగొట్టుకునింది. తిరిగి పొట్లం మడిచి దారంచుట్టి బొడ్లో దోపుకునింది.

వాళ్ళిద్దర్నీ అక్కడే వదిలి పద్మమ్మ నాగవ్వ దగ్గరకు వచ్చింది.

'రేతిరి నుండీ వొకటే మాపన యేడస్తానే వుండావు. నువ్వసలే వొంటి చెంప నొప్పితో అల్లాడతా వుంటావు. కొంచెం దిటవు జేసుకోవాల. లెయ్యి మస్తాన్‌గాడి టీ యంగడికి బొయ్యి టీ నీళ్ళన్నా వుడుకుడుగ్గా తాగొద్దువుగానీ' అని నాగవ్వను లేవదీసింది.

'ఆనా బట్ట పాల చుక్కయినా మిగిల్చినాడో లేదో' అంటూ నాగవ్వతో పాటు నడిచింది'.

వాళ్ళిద్దరూ సందు మలుపు తిర్గానే చెంగమ్మ ఫాతిమా కలిసి పెద్దింట్లోకి అడుగుపెట్టారు. వొకదాని మీద వొకటిగా పేర్చిన కుండలన్నీ దించి వెతకడం మొదలు పెట్టారు.

యిదిచూసి 'పద్నమ్మ జాణగదా' అని చిట్టెమ్మ లక్ష్మమ్మతో అనింది.

'చిట్టెక్కా యిప్పుడా ముక్కుపుల్ల దొరకాల్నే గానీ నాగమ్మ కోడళ్ళిద్దురూ జుట్లు ముడేసుకోని యింకో బాగోతం మొదులు బెట్టరా' అని లక్ష్మమ్మ అనింది.

పెద్దింట్లో నిజంగానే బాగోతం మొదలైంది.

'యేంది బొడ్లో దోపతా వుండావు' అని ఫాతిమా అనుమానంగా చెంగమ్మని అడిగింది.

చెంగమ్మ పట్టించుకోలేదు.

కుండలోని యెండు మిరపకాయలు కిందపోసి కెలుకుతూ వుంది.

'అకా, నిన్నే అడగతా వుండేది. చెవల్లో యేసుకోవేంది' అని ఫాతిమా రెట్టించింది.

'కిందాపైనా మూస్కోని పడుండట్టు' అని చెంగమ్మ తిరకొట్టింది.

'ముక్కుపుల్ల బొడ్లో దోపేసిందిగాక మళ్లనన్నే మూస్కోమంటావా. నువ్వే మూస్కోని బయట పెట్టు' అంటూ ఫాతిమా చెంగవ్మ దగ్గరకు జరిగి చీర ముడిమీద చెయ్యివేసింది.

'తురక లంజా' అంటూ చెంగమ్మ ఫాతిమా జుట్టు పట్టుకుని వీపుమీద పిడిగుద్దులు గుద్దింది. ఫాతిమా విదుల్చుకుని చెంగవ్మ జుట్టు దొరకబుచ్చుకుని యీడ్చింది.

సుబ్బయ్య పరుగున యింట్లో దూరాడు. యిద్దర్నీ విడదీసి ఫాతిమా వీపుమీద రెండు దెబ్బలు వేశాడు. ఫాతిమా పెద్దగా యేడు పెత్తుకునింది.

'మొగుడూ పెళ్ళాలు నన్ను చంపేసినార్రా నాయనో.. ముక్కుపుల్ల సక్క బెట్టేసిందిగాక నన్ను కొట్టి చంపేస్తుండార్రా దేవుడో' అంటూ ఆమె యిల్లు అదిరిపోయేలా యేడుస్తా వుంది.

రంగయ్య కుంటికాలు యెగరేసుకుంటూ లోపలికి వచ్చాడు.

'పెద్దోడివని మతిస్తావుంటే మర్రేద కాపాడు కోకుండా నా పెళ్ళాం మీద చెయిజేసుకున్నావు. యింక మర్రేద దక్కదు నీకు. నీకేం అదాల్తీ వుండాదని దాన్ని కొట్నావు' అని అన్నతో తగవుకి దిగాడు.

సుబ్బయ్య ఆవేశంతో వూగిపోతూ చెంగమ్మ చీర కుచ్చిళ్ళు పట్టుకుని బలంగా గుంజాడు. చీరసగం వూడి చేతికొచ్చింది.

టప్‌మని కింద యేదో పడింది. అందరి కళ్ళు దానిమీదకి తిరిగాయి. కిందపడిన పొట్లం వూడిపోయి ముక్కుపొడి చెల్లాచెదురుగా నేలంతా పరుచుకునింది.

'చూడండ్రా ముక్కుపుల్ల యాడుండాదో' అవమానమూ, ఆగ్రహమూ కలగలిసిన గొంతుతో సుబ్బయ్య జీరగా అరిచాడు.

ఆ సాయంత్రం చీకటి కన్నా ముందు అనుమానం ఆ యింటిని కమ్మేసింది.

అన్నదమ్ముల మధ్యా, తోడికోడళ్ళ మధ్యా, తల్లీబిడ్డల మధ్యా పగ రగిలింది.

తగవులు తన్నులాటలు యేడ్పులు పెడబొబ్బలతో ఆ రాత్రి ఆ యింట్లో మరో పీనుగ లేసినట్లయింది. ☆

